VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
మంగళవారం 19 మార్చి 2024
సంపుటి.01 సంచిక.218

## రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్లేవారు..
### పత్రాలను వెంట ఉంచుకోవాలి



సరిహద్దు చెక్‌పోస్టులు 24 గంటలూ పనిచేస్తాయి

ఈసారి 85 ఏళ్లు దాటిన వారికే ఇంటి నుంచి ఓటు

ఏప్రిల్ 15 వరకు ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చు

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

2 లో

# రూ.100 కోట్ల చెల్లింపులో కవిత పాత్ర

**ఢిల్లీ మద్యం విధానంలో పొందిన ప్రయోజనాలకు ప్రతిఫలంగా భారాస ఎమ్మెల్సీ కవిత ఆప్ నేతలకు రూ.100 కోట్లు చెల్లించడంలో భాగస్వామి అయ్యారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది.**

**తర్వాత వాటిని రాబట్టుకోవడానికి అక్రమార్జన: ఈడీ వెల్లడి**



దిల్లీ: దిల్లీ మద్యం విధానంలో పొందిన ప్రయోజనాలకు ప్రతిఫలంగా భారాస ఎమ్మెల్సీ కవిత ఆప్ నేతలకు రూ. 100 కోట్లు చెల్లించడంలో భాగస్వామి అయ్యారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. హైదరాబాద్‌లో ఈ నెల 15న ఆమెను అరెస్ట్ చేసిన ఈడీ సోమవారం అందుకు సంబంధించిన వివరాలతో పత్రికా ప్రకటన విడుదల చేసింది. "దిల్లీ మద్యం విధాన కుంభకోణంలో తెలంగాణ ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేసింది. దిల్లీలోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు ఆమెను ఈనెల 23వరకు ఈడీ కస్టోడియల్ విచారణకు పంపింది. ఈ ఉత్తర్వులు 16న వెలువడ్డాయి. హైదరాబాద్‌లోని కవిత ఇంట్లో ఈ నెల 15న సోదాలు జరిగాయి. ఆ సమయంలో కవిత బంధువులు, సహచరులు ఈడీ అధికారులను అడ్డుకున్నారు. దిల్లీ మద్యం విధాన రూపకల్పన, అమలు ద్వారా ప్రయోజనాలు పొందడానికి కవిత, మరికొందరితో కలిసి అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా లాంటి ఆప్ అగ్రనేతలతో కుట్ర పన్నారు. ప్రయోజనాలకు ప్రతిఫలంగా ఆమె ఆప్ నేతలకు రూ. 100 కోట్లు చెల్లించడంలో భాగస్వామి అయ్యారు. 2021-22 దిల్లీ మద్యం విధాన రూపకల్పన, అమలులో అవినీతి, కుట్రలకు పాల్పడి టోకు వర్తకుల నుంచి ఆప్ నేతలకు నిరంతరం ముడుపులు వచ్చేలా చూశారు. ఆ తర్వాత ఆప్ నేతలకు ముందస్తుగా చెల్లించిన ముడుపులను రాబట్టుకోవడానికి కవిత, ఆమె అనుచరులు ఈ మొత్తం వ్యవహారం ద్వారా లాభాలు, నేరపూరిత ఆర్జన దక్కేలా కుట్ర పన్నారు. ఇప్పటివరకూ.. ఈ కేసులో ఈడీ దిల్లీ, హైదరాబాద్, చెన్నై, ముంబయి, ఇతర ప్రాంతాల్లో 245 చోట్ల సోదాలు నిర్వహించింది. ఆప్‌నకు చెందిన మనీశ్ సిసోదియా, సంజయ్‌సింగ్, విజయ్‌నాయర్‌లతోపాటు 15 మందిని అరెస్ట్ చేసింది. ఒక ఛార్జిషీట్, 5 అనుబంధ ఛార్జిషీట్లను దాఖలు చేసింది. ఇందులో పొందిన అక్రమార్జన ద్వారా కొనుగోలు చేసిన రూ. 128.79 కోట్ల ఆస్తులను గుర్తించి తాత్కాలికంగా అటాచ్ చేశాం. ఇందుకు సంబంధించి గత ఏడాది జనవరి 24, జులై 3 తేదీల్లో జారీచేసిన ఉత్తర్వులను అడ్జుడికేటింగ్ అథారిటీ ఖరారు చేసింది. ఈ కేసులో దర్యాప్తు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది" అని ఈడీ ప్రకటనలో పేర్కొంది.

## రెండో రోజూ కలిసిన కేటీఆర్, హరీశ్





దిల్లీ మద్యం కేసులో అరెస్టయి ఈడీ కస్టడీలో ఉన్న కవితను వరుసగా రెండో రోజు ఆమె సోదరుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, న్యాయవాది మోహిత్ రావులు కలిసి మాట్లాడారు. విచారణ జరిగిన తీరు, ఆమె యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు సోమవారం వారు దాదాపు గంట సేపు ఆమెతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో మంగళవారం కేసు విచారణ అంశాలను కవితకు వివరించినట్లు సమాచారం.



# కండువా కప్పి ఆహ్వానించిన గులాబీ బాస్

బిఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ఎవరెన్ని విమర్శలు చేసినా..తనదారి రహదారి

మీడియాతో ఆర్ఎస్పీ వెల్లడి

2 లో



# తెలంగాణ గవర్నర్ పదవికి తమిళిసై రాజీనామా

హైదరాబాద్: తెలంగాణ గవర్నర్ పదవికి తమిళిసై రాజీనామా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకే ఆమె పదవి వీడినట్లు సమాచారం. 2019 సెప్టెంబర్ 8న ఆమె తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తించారు. ఈ పదవికి కూడా ఆమె రాజీనామా సమర్పించారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపించారు.ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తమిళనాడు నుంచి భాజపా తరఫున ఆమె బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గవర్నర్ పదవి చేపట్టకముందు తమిళనాడు భాజపా అధ్యక్షురాలిగా ఆమె వ్యవహరించిన విషయం తెలిసిందే.

# ఎన్నికల్లో ఇసి

## నిబంధనలు రోజువారీ ఖర్చులు తెలపాల్సిందే




**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ తేదీలు ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఎన్నికల వేడి రాజుకుంది. అభ్యర్థుల ప్రకటనతో ప్రధాన పార్టీలు తలమునకలయ్యాయి. గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నాయి. ఎన్నికలు అనగానే ఎంతో వ్యయంతో కూడుకున్న వ్యవహారం. ఒక్కో అభ్యర్థికి లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుంది. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు మార్గదర్శకాలు విడుదల చేసింది. లోక్‌సభ అభ్యర్థులెవరూ రూ. 95 లక్షలకు మించి ఖర్చు చేయరాదని అసెంబ్లీ అభ్యర్థి రూ. 40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని స్పష్టం చేసింది.

# తెలంగాణ వికాసం కోసం బిజెపికి ఓటేయండి



**జగిత్యాల:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించి తెలంగాణ వికాసం కోసం బీజేపీకి ఓటు వేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జగిత్యాలలో జరిగిన విజయసంకల్ప సభలో మోదీ మాట్లాడారు. తెలంగాణలో బీజేపీకి రోజురోజుకి ఆదరణ పెరుగుతోందన్నారు. మే13న తెలంగాణ ప్రజలు చరిత్ర సృష్టిస్తారని.. వికాసం కోసం బీజేపీకి ఓటు వేయాలన్నారు. జూన్4న వచ్చే ఫలితాల్లో ఎన్డీయే 400 సీట్లు గెలవాలని ఆకాంక్షించారు. తనకు మద్దతుగా నిలవాలంటే తెలంగాణలో కూడా సీట్లు గెలవాల్సి ఉందని అన్నారు. ప్రజలంతా తనకు మద్దతు కోసం బిజెపిని గెలిపించాలన్నారు. కరీంనగర్ నుంచి బండి సంజయ్‌ను, నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్‌ను, పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్‌లను గెలిపించాలని ప్రధాని పిలుపునిచ్చారు. వారిని ప్రజలకు పరిచయం చేశారు. విపక్షాల ఇండియా కూటమిలో ఐక్యత లేదన్నారు. కూటమిలో పార్టీలన్ని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారన్నారు. ముంబయిలో జరిగిన రాహుల్ గాంధీ న్యాయ జోడో యాత్రను ప్రస్తావిస్తూ.. విపక్షాల అనైక్యత ఆసభలో కనిపించిందని అన్నారు. రాహుల్‌గాంధీ శక్తిపై తమ పోరాటం అన్నారని.. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో జూన్ 4న తేలిపోతుందన్నారు. శక్తిని నాశనం చేయాలని విపక్ష కూటమి భావిస్తోందన్నారు. తెలంగాణ కలలను కాంగ్రెస్ నాశనం చేసిందన్నారు. కవిత అరెస్ట్‌పై మోదీ మొదటిసారి స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, అలాగే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కమిషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ప్రధాని తన ప్రసంగంలో మహిళలపై ప్రసంశలు కురిపించారు. ఉమెన్ పవర్ చాలా శక్తివంత మైనదన్నారు. మహిళలంతా తమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. మహిళా శక్తిని కాంగ్రెస్ ప్రభుత్వం హేళన చేస్తోందని. మహిళలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవం లేదని విమర్శించారు.తెలంగాణను బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని ప్రధాని మోదీ విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే పని చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వాలేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ విచారణ చేయించడం లేదన్నారు. బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ కవర్ చేయాలని చూస్తోందని, తాము మాత్రం అవినీతి పరులను వదిలిపెట్టేది లేదని మోదీ వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పని తనను తిట్టడమేనని ప్రధాని మోదీ విమర్శించారు. రోజంతా మోదీని తిట్టడానికి వాళ్ల సమయం కేటాయిస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ గ్యారంటీ ఉందన్నారు. కుటుంబ పార్టీలను ప్రజలు దూరంగా పెట్టాలన్నారు. దేశాన్ని దోచుకోవడమే కుటుంబ పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. తెలంగాణలో బిజెపికి మద్దతు పెరుగుతోందని కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు తగ్గుతుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయని, బిజెపికి 400పైగా సీట్లు రావడం ఖాయమని, బిజెపికి ఓటు వేయాలని తెలుగులో ప్రధాని మోడీ చెప్పారు.

**తాను మహిళా శక్తిని నమ్ముకున్నాను**

**రోజురోజుకు పెరుగుతున్న బిజెపి బలం**

**మూడోసారి గెలుపు బిజెపిదే**

**కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలే**

**లిక్కర్ కేసుతో ఢిల్లీకి చేరిన అవినీతి డబ్బు**

**కవిత కేసుపై జగిత్యాల సభలో ప్రధాని మోడీ ప్రస్తావన**



## రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్లేవారు.. పత్రాలను వెంట ఉంచుకోవాలి

హైదరాబాద్: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున.. రూ.50 వేలకు పైగా నగదును వెంట తీసుకువెళ్లే వారు అందుకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని, లేకుంటే అధికారులు స్వాధీనం చేసుకుంటారని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్కే భవన్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "గతంలో 80 సంవత్సరాలు దాటిన వారికి ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం ఉండగా.. ఈ దఫా ఆ వయసు 85 సంవత్సరాలకు పెరిగింది. దివ్యాంగుల విషయంలో గత నిబంధనలే అమలవుతాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు 1,94,822 మంది, దివ్యాంగ ఓటర్లు 5,26,340 మంది ఉన్నారు" అని వివరించారు

**అసెంబ్లీ ఎన్నికల తరవాత 12.49 లక్షల మంది ఓటర్ల నమోదు**

ఓటు నమోదుకు ఏప్రిల్ 15 వరకు అవకాశం ఉందని వికాస్‌రాజ్ వెల్లడించారు. అప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు. ఓటు నమోదు, నియోజకవర్గ మార్పు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. "ఓటర్ల జాబితాలో సవరణల ప్రక్రియను ప్రస్తుతానికి నిలిపివేశాం. గత అసెంబ్లీ ఎన్నికల తరవాత రాష్ట్రంలో 12,49,625 మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. 8,58,491 మంది పేర్లను జాబితా నుంచి తొలగించగా... 7.69 లక్షల మంది తమ వివరాలను సరి చేసుకున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఈవీఎంలు అందుబాటులో ఉన్నాయి. 57 వేల బ్యాలెట్ యూనిట్లు, 44 వేల కంట్రోల్ యూనిట్లు, 48 వేల వీవీ ప్యాట్స్ ఉన్నాయి. ఈవీఎంల తొలిదశ తనిఖీ ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేశాం. సిబ్బందికి వివిధ దశల శిక్షణ పూర్తయింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూలే కంటోన్మెంట్ ఉపఎన్నికకూ వర్తిస్తుంది. పోస్టల్ బ్యాలెట్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల అధికారి స్థాయిలోనే ముద్రించాలని స్పష్టంచేశాం. ఈవీఎం యంత్రాలపై ఏర్పాటు చేసే అభ్యర్థుల వివరాలతో కూడిన పత్రాలను రాష్ట్రస్థాయిలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ ముద్రణాలయంలో ముద్రిస్తాం. ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అమలు చేయనున్నాం" అని వెల్లడించారు. సమావేశంలో ఎన్నికల అధికారులు లోకేశ్‌కుమార్, సర్ఫరాజ్ అహ్మద్, సత్యవాణి పాల్గొన్నారు. రూ.50 వేలకుపైగా నగదు తరలింపునకు బ్యాంకుల నుంచి విత్‌డ్రా రశీదులు, చెల్లింపుల పత్రాలు, నగలకు అయితే సంబంధిత ఆర్డర్ కాపీ, తరలింపు పత్రం తదితరాలను వెంట ఉంచుకోవాలని అధికారులు ఇప్పటికే వెల్లడించారు.

## కాంగ్రెస్ పార్టీ అనూహ్య నిర్ణయం

**అమరావతి:** కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పోటీ చేయనున్నారు. కడప నుంచి పోటీ చేయాలని ఆమెపై కాంగ్రెస్ అధిష్టానం ఒత్తిడి తెచ్చింది. హస్తం పెద్దల ఆదేశాల మేరకు ఆమె కడప ఎంపీగా పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ నెల 25న కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేయనున్నారు. అటు, రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెచ్చేలా షర్మిలతో పాటు ఇతర కాంగ్రెస్ సీనియర్ నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విశాఖలో 'న్యాయ సాధన సభ' పేరిట నిర్వహించిన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ పై విమర్శలు గుప్పించారు. వచ్చే ఎన్నికల్లో ఏపీ ప్రజలు షర్మిలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కాగా, త్వరలోనే తొలి జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో ప్రచారం మరింత ముమ్మరం చేసేలా షర్మిల నేతలు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. కాగా, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 'ప్రజాగళం' సభపై షర్మిల ట్విట్టర్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. అటు చంద్రబాబును, ఇటు జగన్ ను 2 పంజరాల్లో పెట్టుకుని ఆడిస్తోన్న రింగ్ మాస్టర్ బీజేపీ అంటూ మండిపడ్డారు. పదేళ్ల రాష్ట్ర వినాశనంలో ముఖ్య పాత్ర పోషించిన పార్టీ బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వం అంటూ ఆమె నిప్పులు చెరిగారు. 'కాంగ్రెస్, వైసీపీ ఒకటే అని ప్రధాని మోదీ కూతలా? ఐదేళ్లుగా జగన్ తో అంటకాగిందెవరు. వైసీపీ నేతల అరాచకాలను అడ్డుకోకుండా, ఎదురు వారికి అడ్డగోలు సహాయ సహకారాలు అందించింది బీజేపీ. ఇంకా నాశనం చేసుకోండి, ఇంకా అప్పుతెచ్చుకోండి అంటూ తెరచాటు స్నేహం నడిపింది ఎవరో, దత్తపుత్రుడు అన్నది ఎవరినో.' అంటూ సెటైర్లు వేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు సిగ్గువిడిచి సపోర్ట్ చేసింది జగన్ రెడ్డి సర్కారు అని షర్మిల ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ మిత్రులు అదానీ, అంబానీలకు రాష్ట్రంలో ఆస్తులు కట్టపెట్టి, వారికీ రాజ్యసభ సీట్లు ఇచ్చింది జగన్ సర్కారు అని ఆరోపించారు. ఇది వీరి స్నేహం, విడదీయరాని బంధం అంటూ జగన్ పై సెటైర్లు వేశారు. 'హామీలు ఇచ్చింది కాంగ్రెస్, వాటిని తుంగలో తొక్కింది బీజేపీ, టీడీపీ, వైసీపీ. ఇప్పుడు ఆ అసమర్థత, మోసాలను కప్పిపెట్టాలని కాంగ్రెస్ మీద పసలేని దాడులు చేస్తున్నారు. అంటే కాంగ్రెస్‌కు మీరు భయపడుతున్నారా.?' అని బీజేపీని వైఎస్ షర్మిల నిలదీశారు.

## వైఎస్ కుటుంబంలో మళ్లీ పోటీ

**కడప:** ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికలు తారాస్థాయిలో జరగబోతున్నాయి. గతంలో ఎప్పుడూ చూడని విధంగా ఇప్పుడు ప్రతిష్టాత్మకంగా కనిపిస్తున్నాయి. ఏకంగా అన్నపై ఇన్ని రోజులు విమర్శలు చేస్తూ వచ్చిన షర్మిల ఆయన్నే ఢీ కొట్టేందుకు సిద్ధమయ్యారు. కడప ఎంపీగా పోటీ చేస్తున్నారు. ఇది నేరుగా అన్న జగన్‌పై పోటీ కాకపోయినా ఆయన నమ్మిన బంటుగా ఉన్న అవినాష్‌ను ఢీ కొడుతున్నారు. వైఎస్ ఫ్యామిలీ ఫైట్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా మారింది. వైఎస్ వివేక హత్య కేంద్రంగా వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో అవినాష్ పాత్ర ఉందని వైఎస్ వివేక కుమార్తె సునీతతోపాటు ఆంధప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపిస్తూ వస్తున్నారు. సొంత బాబాయ్ ను హత్య చేసిన అవినాష్‌కు జగన్ సహాయం చేస్తున్నారని ఆయన్ని కాపాడుతున్నారని మండిపడుతు న్నారు. వైఎస్ వివేక హత్య కేసులో అవినాష్ ప్రధాన ముద్దాయి అంటూ షర్మిల, సునీతతోపాటు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాంటి విమర్శలు పట్టించుకోని జగన్... అవినాష్‌కు కడప ఎంపీ టికెట్ మరోసారి ఇచ్చారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తన సపోర్ట్ పూర్తిగా అవినాష్‌కే ఉంటుందని చెప్పకనే చెప్పేశారు. వారి విమర్శలకు ఇలా సమాధానం చెప్పారు. అవినాష్ కడప ఎంపీగా వైసీపీ తరఫున పోటీ చేస్తుండటంతో అక్కడ ఆయనకు పోటీగా సునీత కానీ ఆమె తల్లి సౌభాగ్యమ్మ కానీ పోటీ చేస్తారని అంతా భావించారు. కానీ ఇప్పుడు అనూహ్యంగా షర్మిలయే అక్కడ పోటీకి దిగబోతున్నారు. నేరుగా అవినాష్‌తో ఢీ కొట్టేందుకు సిద్ధమయ్యారు. అధికారికంగా దీనిపై ఇంత వరకు సమాచారం లేకపోయినా కాంగ్రెస్ పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం కడప ఎంపీ స్థానానికి షర్మిల పేరు ఖరారు అయినట్టు తెలుస్తోంది. వైసీపీ పునాదులు రక్తం తడిసి ఉన్నాయని ఆరోపిస్తూన్న సునీత, షర్మిల ఇప్పుడు వారిపైనే పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. ఇలా వైఎస్ ఫ్యామిలీ పోటీ కొత్తకాదు. గతంలో వైఎస్ వివేకానంద కూడా వైఎస్ విజయపై పోటీ చేసి ఓడిపోయారు. అప్పట్లో కాంగ్రెస్‌ను విభేదించి పార్టీ పెట్టుకున్న జగన్, విజయమ్మ తమ పదవులకు రాజీనామా చేశారు. అప్పట్లో విజయమ్మ రాజీనామాతో పులివెందులకు, జగన్ రాజీనామాతో కడప ఎంపీ స్థానానికి ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ బై ఎలక్షన్‌లలో పులివెందుల నుంచి విజయమ్మకు పోటీగా వివేకానంద పోటీ చేశారు. ఆయనకు డిపాజిట్లు కూడా రాలేదు. అలాంటి పోటీ ఇప్పుడు మళ్లీ వైఎస్ ఫ్యామిలీలో కనిపిస్తోంది. వివేక హత్య కేసులో ప్రధాన నిందితుడు అవినాష్ అని ఆయన్ని జగన్ ఎందుకు కాపాడుతున్నారో అర్థం కావడంలేదని షర్మిల ఆరోపిస్తున్నారు. తండ్రిలేని సునీతకు తాను అండగా ఉంటానని... దోషులకు శిక్ష పడే వరకు విశ్రమించబోనని మొన్ననే ప్రకటించారు. అయితే షర్మిల ఎక్కడైనా అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తారని...సునీతను లేదా సౌభాగ్యమన్ను కడప పార్లమెంట్ స్థానంలో నిలబెడతారని అనుకున్నారంతా. దీనిపై వారిద్దరిని చాలా సార్లు ప్రశ్నిస్తే సమయం వచ్చినప్పుడు అన్నీ చెబుతామంటూ దాటవేశారే తప్ప సమాధానం చెప్పలేదు. ఇప్పుడు ఆ ప్రశ్నలకు సమాధానం దొరికినట్టు అయింది. పోటీలో షర్మిలయే నిలబడుతున్నట్టు ఖరారు అయింది.

ప్రజలు ఎవరికి పట్టం కడతారో చూడాలి. ఓవైపు సంక్షేమ అజెండాతో వెళ్తున్న వైసీపీ అభ్యర్థి అవినాష్‌కు జనం ఓటేస్తారా? లేకుంటే వివేక హత్య కేసు నిందితుడు అవినాష్‌ను ఆయనకు సహకరిస్తున్న జగన్‌ను ఓడించాలన్న షర్మిల నినాదానికి మద్దతు ఇస్తారో జూన్ నాలుగున తేలిపోనుంది. వీళ్ల ఆరోపణలు మాత్రమే కాదు. సీబీఐ కూడా అవినాష్ పాత్రను అనుమానిస్తోంది. ఆయన్ని చాలా సార్లు విచారించింది. అరెస్టు కూడా చేసినట్టు పేర్కొంది. అరెస్టు అయిన కొన్ని గంటల్లోనే బెయిల్ కూడా వచ్చిందని వివరించింది. మొత్తానికి వివేక హత్య జరిగి ఐదేళు అవుతున్నా కాక మాత్రం తగ్గలేదు. అప్పట్లో దీన్నే ప్రధాన అస్త్రంగా వాడుకొని జగన్ ప్రచారం చేశారు. ఈ కేసులో చంద్రబాబు హస్తం ఉందని జనంలోకి తీసుకెళ్లారు. కానీ ఐదేళ్లు తిరిగే సరికి సీన్ రివర్స్ అయింది. ఇప్పుడు జగన్ హస్తం ఉందంటూ సొంత ఇంటి సభ్యులే ఆరోపిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. ప్రజల తీర్పు ఎలా ఉంటుందో వేచి చూడక తప్పదు.

## రష్యా అధ్యక్షుడుగా పుతిన్

**మాస్కో:** రష్యా అధ్యక్షుడిగా పుతిన్ మరోమారు పగ్గాలు చేపట్టనున్నారు. ఆయన ఎన్నిక లాంఛనం కానుంది. రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ మరోసారి ఘన విజయం సాధించారు. మూడు రోజులుగా జరుగుతున్న రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ఆదివారం ముగిసింది. ప్రాథమిక ఫలితాల ప్రకారం పుతిన్‌కు రికార్డు స్థాయిలో 87.8 శాతం ఓట్లు లభించినట్లు తెలుస్తున్నది. 24 ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపును చేపట్టిన మీదట ఈ విషయం తేలింది. దీంతో ఆయన ఐదోసారి దేశాధ్యక్ష పదవిని చేపట్టనున్నారు. మార్చి 15న ప్రారంభమైన ఎన్నికల పోలింగ్ మూడు రోజుల పాటు జరిగి 17న ముగిశాయి. 1999 నుంచి దేశ అధ్యక్షుడిగా కొనసాగుతున్న పుతిన్.. తాజా విజయంతో మరో ఆరేండ్లపాటు అదే పదవిలో ఉండనున్నారు. దీంతో రష్యాలో ఎక్కువ కాలం అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తిగా జోసెఫ్ స్టాలిన్‌ను అధిగమించనున్నారు. కాగా, ఈ ఎన్నికల్లో పుతిన్‌తో కలిపి నలుగురు అధ్యక్ష పదవికి పోటీపడ్డారు. అయితే ప్రధాన ప్రత్యర్థి అయిన నావల్నీ ఎన్నికలకు ముందే చనిపోవడంతో ఆయనకు అసలు పోటీయే లేకుండా పోయింది.

మూడు రోజులుగా జరుగుతున్న రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ఆదివారం ముగిసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు దాదాపు 88శాతం ఓట్లు లభించినట్లు తెలుస్తోంది. 24 ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపును చేపట్టిన మీదట ఈ విషయం తేలింది.

# బడుగుల అండను కోల్పోతున్న బిఎస్పీ

**ఆత్మపరిశీలన చేసుకోని మాయావతి**

**ప్రవీణ్ కుమార్ నిర్ణయం శరాఘాతం**



హైదరాబాద్: ఒకప్పుడు యూపీ రాజకీయాలను శాసించిన బీఎస్పీ నామావశిష్టంగా మారిపోవడం విషాదం. బడుగు వర్గాలకు అండగా నిలిచిన పార్టీ మట్టి కరచి పోవడం దేశంలో బడుగులకు గొడుగు లేకుండా పోయింది. దీనికితోడు మాయావతి నాయకత్వం కూడా ప్రభావవంతంగా లేదు. ఇలాంటి సందర్భంలో తెలంగాణలో ఐపిఎస్ పదవికి రాజీనామా చేసి బిఎస్పీలో చేరిన ప్రవీణ్ కుమార్ లాంటి వారికి ఈ ఫలితాలు నిస్తేజం కలిగించేవే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బిఎస్పీ తెలంగాణలో ఎక్కడా ప్రభావం చూపలేదు. అలాగే బిఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ కూడా ఓటమి చెందారు. ఈ క్రమంలో అనూహ్యంగా యాన రాజీనామా చేయడం, బిఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించడంతో పరువు పోగొట్టుకున్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించి ఇప్పుడు అదే పార్టీలో చేరడం ద్వారా విలువలను తుంగలో తొక్కారు. తానే నామమాత్రపు రాజకీయనేతనని చాటుకున్నారు. దీంతో తెలంగాణలో ఇక బిఎస్పి ప్రస్థానం ముగిసినట్లుగనే భావించాలి. ఒకప్పుడు యూపిని ఏలడంతో పాటు, బడుగులకు ఆశాజ్యోతిగా ఉన్న బిఎస్పీ ఇప్పుడు ఉనికి కోల్పోవడం చూస్తుంటే..బడుగులకు కూడా ఆశలు సన్నగిల్లాయా అన్న అనుమానాలు వస్తున్నారు. అంతేగాకుండా యూపిలో అధికార పీఠానికి దూరంగానే మిగిలిపోయింది. సంక్లిష్ట కుల, ప్రాంత సమీకరణలతో బహుముఖ పోటీ ఉండే యూపీ లాంటి రాష్ట్రం కేవలం బీజేపీ, ఎస్పీల ద్విముఖ పోరుగా మారిపోవడం గమనించాలి. ఈ పోరుతో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)తో పాటు కాంగ్రెస్ కూడా నలిగిపోయింది. ప్రియాంక పగ్గాలు తీసుకొని ప్రచారం చేసినా, యూపీలో 3 శాతం కన్నా తక్కువ ఓట్లకే కాంగ్రెస్ పరిమితమైతే, బిఎస్పీ అంతకన్నా దారుణ పరాభవాన్ని మూటకట్టుకుంది. దశాబ్దాలుగా లేని విధంగా యూపీలో అధికార పక్షాన్నే రెండోసారీ పీఠమెక్కించాయి. గతంలో బిజెపి మద్దతుతో లేదా ఎస్పీ మద్దతుతో అధికారం నడిపిన మాయావతి ఎందుకనో నిస్తేజంగగా మారారు. తాజా రాజకీయాల్లో నామమాత్ర పాత్రకే పరిమితం అయ్యారు. బిఎస్పీ తన పూర్వ ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయింది. గూండాగిరీకి దూరంగా శాంతిభద్రతల పానలపై ప్రచారం యూపీలో బీజేపీకి కలిసొచ్చాయి.

ఇంటింటా ఎన్నికలలో గెలుపోటములు ఎక్కువగా సెంటిమెంట్ అంశాల మీదే తప్ప, అసలు వాస్తవాల మీద ఆధారపడి ఉండవు. అయితే ఓటు బ్యాంకును కూడా కోల్పోవడం మాయావతి నాయకత్వ వైఫల్యం తప్ప మరోటి కాదు. కాన్షీరామ్ లాంటి బలమైన నేత ఇప్పుడు బిఎస్పీకి రావాలి. బడుగు బలహీనవర్గాలకు అండగా ఉన్నారన్న ప్రభావం చూపాలి. ధరల పెరుగుదల, ఉపాధి లేమి, రైతు ఉద్యమాలు, మధ్యతరగతి కష్టాలు, అధికారపక్షానికి సాధారణంగా ఎదురయ్యే వ్యతిరేకత లాంటివేవీ బీజేపీ గెలుపును ఆపలేక పోయాయి. భావోద్వేగాలను ప్రేరేపించే ఈ ప్రయత్నం తాజా ఎన్నికల్లోనూ ఫలించింది. పార్టీ అధికారంలో ఉన్న యూపీలో లఖీమ్‌పూర్ ఖేరీ, హాథ్రస్ లాంటి ఘటనలు, ఉత్తరాఖండ్‌లో సీఎంల మార్పులు, గోవాలో అంతర్గత బలహీనతల లాంటి ప్రతికూలతలున్నా ఓటర్ల తీర్పు మాత్రం బీజేపీకే అనుకూలించింది. పోటాపోటీ ఉంటుందన్న ఉత్తరాఖండ్‌లో తుది తీర్పు కాంగ్రెస్‌కు షాక్ కలిగించింది. నిజానికి బిఎస్పీ, కాంగ్రెస్ పార్టీల్లోనే బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట దక్కుతుంది. అలాంటిది ఈ రెండు పార్టీలు ఈ ఎన్నికలతో తమ మూలాలను కోల్పోయాయి. బీజేపీ, మోదీ ప్రభంజనాలకు ఇప్పటికైతే తిరుగులేదనే భావనను ఈ ఎన్నికలు కలిగించాయి. విభిన్న సమీకరణాల ఎన్నికల రాజకీయాల నిర్వహణలో ప్రస్తుతం దేశంలో మరే పార్టీ దానికి పోటీలో లేవని నిరూపితం అయ్యింది. కులాల గురించి పోరాడుతున్న వారు సైతం బిజెపి గొడుగుకిందకు చేరుతున్నారు. ఈ ఫలితాలతో బిఎస్పీ ఆత్మపరిశీలన చేసుకోవాలి.

నిజానికి బిఎస్పీలో కూడా మాయావతి తిరుగేలని నియంతలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ రకంగా చెప్పాలంటే బిఎస్పీ, కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ఆప్, బిజెపిలకు మళ్లుతోందని గుర్తించాలి. అదే సందర్భంలో పర్మినెంట్ ఓటు బ్యాంక్ కూడా ఇక ఉండబోదన్న సంకేతాలను గుర్తించాలి. కొత్త ఓటర్ల రాక,యువత ఆలోచనలు మారడం లాంటివి కూడా సంప్రదాయ ఓటుబ్యాంక్‌ను దెబ్బతీస్తున్నాయి. మోదీ పాపులారిటీకి యువత ఆకర్శితులు అవుతున్నారు. ఇప్పటికైనా నాయకత్వ లోపాలను సరిదిద్దుకోకపోతే బిఎస్పీకి భవిష్యత్తు కష్టమే.

## గొర్రెల మందలో ఒకడిని కాలేను

**పొగుడుతూనే బెదరిస్తున్న రేవంత్**

**బిఎస్పీని వీడి బిఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్పీ**

హైదరాబాద్: గేట్లు తెరిస్తే వచ్చే గొర్రెల మందలో తాను ఒకరిని కాలేనని చెబుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఘాటు సమాధానం ఇచ్చారు. రేవంత్ రెడ్డి ఒక వైపు పొగుడుతూనే మరో వైపు బెదిరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్పీ మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి తనను సుతిమెత్తగా పొగుడుతూనే అదేస్థాయిలో వార్నింగ్ ఇస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవికి ఆహ్వానం పలికినట్లు, తాను ఆ పదవిని తిరస్కరించినట్లు చెబుతున్నారు. ఆ మాట వాస్తవమే. ప్రజాక్షేత్రంలోనే ఉండాలను కున్నాను. కాబట్టి రేవంత్ ఆఫర్‌ను తిరస్కరించాను. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్‌లోకి వెళ్తే తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలంటూ మరోవైపు బెదిరిస్తున్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ లేదా.. ఏ వేదిక మీద పని చేయాలి. ఎక్కడ పని చేయాలనే స్వేచ్ఛ తెలంగాణ ప్రజలకు లేదా.. అని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. గేట్లు తెరిస్తే చాలా మంది పిరికిపందలు, స్వార్థపరులు, అసమర్థులు వస్తున్నారు. గొర్రెల మందలాగా వస్తున్నారు. ఆ గొర్రెల మందలో ప్రవీణ్ కుమార్ ఒకరు కాలేరు. ప్రవీణ్ నిజమైన, నిఖార్సుగా, నిజాయితీగా పని చేసే వ్యక్తి. ఆ గొర్రెల మందలో ప్రవీణ్ కుమార్ ఒకడు కాలేదని రేవంత్ రెడ్డి అక్కసుతో మాట్లాడుతున్నారని ఆర్ఎస్పీ మండిపడ్డారు.రేవంత్ రెడ్డి బెదిరించడం మానుకోవాలని అన్నారు. ఎంత ప్యాకేజీ తీసుకున్నావు అని సోషల్ మీడియాలో అంటున్నారు.

# రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్లేవారు..

## పత్రాలను వెంట ఉంచుకోవాలి



హైదరాబాద్ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున.. రూ.50 వేలకు పైగా నగదును వెంట తీసుకువెళ్లే వారు అందుకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని, లేకుంటే అధికారులు స్వాధీనం చేసుకుంటారని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్కే భవన్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "గతంలో 80 సంవత్సరాలు దాటిన వారికి ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం ఉండగా.. ఈ దఫా ఆ వయసు 85 సంవత్సరాలకు పెరిగింది. దివ్యాంగుల విషయంలో గత నిబంధనలే అమలవుతాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు 1,94,822 మంది, దివ్యాంగ ఓటర్లు 5,26,340 మంది ఉన్నారు" అని వివరించారు.అసెంబ్లీ ఎన్నికల తరవాత 12.49 లక్షల మంది ఓటర్ల నమోదుఓటు నమోదుకు ఏప్రిల్ 15 వరకు అవకాశం ఉందని వికాస్‌రాజ్ వెల్లడించారు. అప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు. ఓటు నమోదు, నియోజకవర్గ మార్పు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. "ఓటర్ల జాబితాలో సవరణల ప్రక్రియను ప్రస్తుతానికి నిలిపివేశాం. గత అసెంబ్లీ ఎన్నికల తరవాత రాష్ట్రంలో 12,49,625 మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. 8,58,491 మంది పేర్లను జాబితా నుంచి తొలగించగా... 7.69 లక్షల మంది తమ వివరాలను సరి చేసుకున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఈవీఎంలు అందుబాటులో ఉన్నాయి. 57 వేల బ్యాలెట్ యూనిట్లు, 44 వేల కంట్రోల్ యూనిట్లు, 48 వేల వీవీ ప్యాట్స్ ఉన్నాయి. ఈవీఎంల తొలిదశ తనిఖీ ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేశాం. సిబ్బందికి వివిధ దశల శిక్షణ పూర్తయింది.

లోక్‌సభ ఎన్నికల షెడ్యూలే కంటోన్మెంట్ ఉపఎన్నికకూ వర్తిస్తుంది. పోస్టల్ బ్యాలెట్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల అధికారి స్థాయిలోనే ముద్రించాలని స్పష్టంచేశాం. ఈవీఎం యంత్రాలపై ఏర్పాటు చేసే అభ్యర్థుల వివరాలతో కూడిన పత్రాలను రాష్ట్రస్థాయిలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ ముద్రణాలయంలో ముద్రిస్తాం. ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అమలు చేయనున్నాం" అని వెల్లడించారు.

# తెలుగు రాష్ట్రాల్లో మోడీ జోష్

సార్వత్రిక ఎన్నికల నగారా మోగడం ఆలస్యం..బిజెపి రంగంలోకి దూకింది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో మోడీ పర్యటనతో జోష్ నింపింది. ఏకకాలంలో రెండు రాష్ట్రాల్లో మోడీ సభలు విజయవంతం అయ్యాయి. మల్కాజిగిరిలో రోడ్ షోతో మొదలు, నాగర్ కర్నూలు, జగిత్యాలలో భారీ బహిరంగ సభలు నిర్వహిం చారు. అలాగే ఎపిలో కూడా మోడీ శంఖారావం పూరించారు. టిడిపి-జనసేన కూటమితో కలసి తొలిసారిగా ఎన్నికల రంగంలోకి దిగారు. మోడీ రాకతో బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అలాగే చేరికలను కూడా బిజెపి ప్రోత్సహిస్తోంది. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరేవారితో బిజెపి కొంత బలం పుంజుకుంది. మోడీ గ్యారెంటీ పేరుతో ఎక్కడికి వెళ్లినా ప్రధాని మోడీ మార్మోగిస్తున్నారు. జైభారత్, జాశ్రీరామ్ నినాదాలు మోగిస్తున్నారు. ప్రజలు కూడా మోడీపట్ల సానుకూలతనే ప్రకటిస్తున్నారు. స్థానికంగా బిజెపికి ఎలాంటి బలం లేకున్నా మోడీ మేనియా ఉందనడంలో సందేహం లేదు. ఇకపోతే సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలతో బిజెపి తీరుగలేని ఆధిపత్యం సాధించింది. బిజెపికి ప్రత్యామ్నాయం అంటూ తొడగొట్టిన పార్టీలన్నీ చతికిల పడ్డాయి. మోడీ, అమిత్ షాల వ్యూహం ముందు ఇప్పుడు ఎవరి వ్యూహం పనిచేయడం లేదు. ఈ క్రమంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాలు ఎలాంటి వ్యూహం అనుసరిస్తాయన్నదే ముఖ్యం. ఎందుకంటే మోడీ వ్యూహం ఇప్పటికే సిద్దం అయి ఉంటుంది. అది ఏంటన్నది త్వరలో బయటకు రానుంది. ఈ క్రమంలో విపక్షం నుంచి ఉమ్మడి ప్రధాని అభ్యర్థిగా ఎవరు ఉంటున్నది ఆసక్తిగా మారింది. కాంగ్రెస్‌తో కలసి ఉమ్మడి ప్రధాని అభ్యర్థిని ప్రకటించే విషయంలో ఏ ఒక్క పార్టీ కూడా ఇప్పటికీ ప్రయత్నాలు మొదలు పెట్టలేదు. ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేస్తామని ప్రకటించిన కెసిఆర్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో చలతికిల పడ్డారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు తరవాత అనూహ్యంగా బీహార్ సిఎం నితీశ్ కుమార్ మరోమారు ఎన్డీఎ గూటికి చేరడంతో ఇండియా కూటమి బలహీనపడింది. ఎపిలో జగన్ ప్రభుత్వం తీరుపై మోడీ తొలిసారిగా ఘాటు విమర్శలు చేశారు. తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతిపైనా మోడీ విమర్శలు గుప్పిం చారు. ఈ క్రమంలో మరోసారి పీఠమెక్కడానికి బిజెపి సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు ఇదే సరైన సమయం అయినా అది గట్టిగా నిలబడలేక తంటాలు పడుతోంది. ఎన్నికల్లో ఎన్‌డిఎకు గట్టి పోటీ ఇస్తారా లేదా అన్నది చూడాలి. విపక్షాలు ఐక్యతకు కూడా ఇదో పరీక్ష. ఇక్కడి నుంచే ఇక ఉమ్మడి ఎజెండాతో ముందుకు సాగితే సానుకూల అవకాశాలు ఉంటాయి. మోడీని ఎన్నికల్లో మాత్రమే ఎదరించకుండా..మోడీ విధానాలను ఎదరించేందుకు ఇక నిరంతరంగా శ్రమించాల్సిన బాధ్యతను తీసు కుంటే తప్ప ప్రజలు నమ్మరు. అందుకు ప్రాంతీయ పార్టీలు అనుసరించే వ్యూహం ఏంటన్నది ముున్ముందు బయటపడనుంది. ఇదిలావుంటే లోక్‌సభ ఎన్నికలు తెలంగాణలోని మూడు ప్రధాన పార్టీలకూ విషమ పరీక్షగా ఉండబోతున్నాయి. దశాబ్దం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సుస్థిరంగా కొనసాగాలంటే ఆ పార్టీ కనీసం ఓ పది లోక్‌సభ సీట్లు గెలవగలగాలి. లేకుంటే కష్టమే కాగలదు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే ఇప్పుడు ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని కొట్టేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీ, తన ఆకాంక్ష నెరవేరాలంటే కనీసం ఐదారు స్థానాలు గెలుచుకోవాలి.

# బీజేపీకి ఎన్ని సీట్లు ఎక్కువ వస్తే.. నాకు అంత శక్తి

కుటుంబ పార్టీలు దేశాన్ని దోచుకునేందుకే రాజకీయాలు చేస్తాయని.. దేశంలో ఏ దోపిడీని పరిశీలించినా దాని వెనుక కుటుంబ పార్టీలే ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. జగిత్యాలలో జరిగిన బీజేపీ విజయ సంకల్ప సభలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. ఆ రెండు పార్టీలు తనను తిట్టడమే పనిగా పెట్టుకున్నాయని అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుంటే.. కాంగ్రెస్ ఏటీఎంలా మార్చుకుంటోందని ఆక్షేపించారు.
తెలంగాణలో బీజేపీకి ఎన్ని సీట్లు ఎక్కువ వస్తే.. తనకు అంత శక్తి వస్తుందని ప్రధాని మోదీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు వెలువడిన తర్వాత రాష్ట్రంలో తొలిసారి నిర్వహిస్తున్న జగిత్యాల విజయసంకల్ప సభలో ఆయన ప్రసంగించారు. దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని.. భారత్ అభివృద్ధి చెందితే తెలంగాణలో కూడా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. 13న తెలంగాణ ప్రజలు కొత్త చరిత్ర సృష్టించబోతున్నారని.. వికసిత్ భారత్ కోసం తెలంగాణ ప్రజలు ఓటు వేయబోతున్నారని మోదీ వెల్లడించారు. తెలంగాణలో బీజేపీ క్రమంగా బలపడుతో ందిని.. మాల్కాజ్‌గిరిలో ప్రజలు బ్రహ్మరథం పట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు అబ్ కీ బార్.. 400 పార్ అంటున్నారని.. ఈ సారి పక్కాగా 400 సీట్లు సాధిస్తామన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు ఉన్న ఆగ్రహం అసెంబ్లీ ఎన్నికల్లో బయటపడిందన్న మోదీ... తెలంగాణను దోచుకున్న వాళ్లను తాము వదిలిపెట్టమని హెచ్చరించారు. తమకు అధికారం కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యమని వెల్లడించారు. తెలంగాణలో ఎన్నో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధికారంలో ఉంటే.. రాష్ట్రం మరెంతో అభివృద్ధి చెంది ఉండేదని అన్నారు. పసుపు రైతులను బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదని.. బీజేపీ ప్రభుత్వం మాత్రమే పసుపు రైతులకు మేలు చేసిందని



వ్యాఖ్యానించారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ తెలంగాణను దోచుకుంటే.. ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఏటీఎంలా మార్చుకుంటోందని విమర్శించారు. బీఆర్ఎస్‌పై అవినీతి ఆరోపణలు చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ ఫైల్స్‌ను పక్కన పెడుతోందన్నారు. కాళేశ్వరం అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కయ్యా యని.. లిక్కర్ స్కామ్‌లోనూ బీఆర్ఎస్ కమీషన్లు తీసుకుందని మోదీ ఆరోపించారు. ఆ రెండు పార్టీలు తనను దూషించటమే పనిగా పెట్టుకున్నాయని అన్నారు. తెలంగాణ నుంచి దోచిన డబ్బులు ఢిల్లీలో కుటుంబ పార్టీ పెద్దలకు వెళ్తున్నాయన్నారు. దేశంలో జరిగిన స్కామ్‌లన్నింటికీ కుటుంబ పార్టీలే కారణమని అన్నారు. రాహుల్ అగ్రనేత రాహుల్ గాంధీపైనా మోదీ విమర్శలు గుప్పించారు. శివాజీ మైదానంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ తన పోరాటం శక్తికి వ్యతిరేకం అని చెప్పారని గుర్తు చేశారు. శక్తిని వినాశనం చేసేవాళ్లకు.. శక్తికి పూజ చేసే వాళ్లకు మధ్య పోరాటం జరగబోతుందన్నారు. శక్తిని ఖతమ్ చేస్తామన్న రాహుల్ గాంధీ ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నట్లు మోదీ వెల్లడించారు. చంద్రయాన్ విజయవంతమైన ప్రాంతానికి కూడా శివశక్తి అని పేరు పెట్టామని.. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో.. జూన్ నాలుగో తేదీన తెలుస్తుందని అన్నారు. తాను భారతమాతకు పూజారిని అంటూ మోదీ వ్యాఖ్యానించారు.

# స్పీకర్‌కు బీఆరెఎస్ శాసనసభాపక్షం ఫిర్యాదు
## ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానంపై చర్యలు



తీసుకోవాలంటూ బీఆరెఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి పార్టీ ఫిరాయింపుకు పాల్పడిన దానంపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ ఇచ్చారు. కాగా, దానం ఆదివారం గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ శాసనసభాపక్షం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ హైదర్‌గూడలోని స్పీకర్ నివాసానికి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు పిటిషన్‌ను అందజేశారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్పించుకొని ఆనందం పొందుతున్నాడని మండిపడ్డారు. 'నువ్వు కొట్టినావ్ మేము తీసుకున్నాం.. మేము కొట్టినప్పుడు రేవంత్ రెడ్డి.. నువ్వు లేవకుండా పోతావ్.' అని ఘాటు కామెంట్స్ చేశారు. సింహం ఒక అడుగు వెనక్కి వేసిందంటే.. తిరిగి నాలుగు అడుగు ముందుకు దూసుకు వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.
బీఆర్ఎస్‌కు భారీ షాక్.. కాంగ్రెస్ గూటికి దానం, రంజిత్ రెడ్డి కాగా, ఆదివారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఇద్దరూ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దాంతో దానంపై అనర్హత వేటు వేయాలని ఇవాళ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి పిటిషన్ ఇచ్చారు. అయితే ఈ పిటిషన్‌పై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకుంటాం నేది ఆసక్తిగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాల్లో పెద్దగా ప్రభావం చూపకపో యినా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం సత్తా చాటింది. అన్ని స్థానాలు కైవసం చేసుకు ంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి రేవంత్ మంత్రివర్గంలో ఎవరికీ ప్రాతినిధ్యం లేదు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మంత్రి పదవి ఆఫర్‌తోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే కాకుండా దానంను సికింద్రా బాద్ ఎంపీగా బరిలోకి దింపేందుకు కాంగ్రెస్ రెడీ అయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# నేను సీఎం అయితే 'లిక్కర్' నిషేధిస్తా..

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేయటంతో.. తెలంగాణలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. అయితే.. అటు రాజకీయాల్లోనే కాకుండా.. ఇటు సోషల్ మీడియాలోనూ కవిత అరెస్ట్‌పై చర్చ నడుస్తోంది. కాగా.. ఎవరో కానీ ఓ నెటిజన్ పురాతన తవ్వకాల నుంచి కవిత పాత వీడియోను పట్టి సోషల్ మీడియాలో షేర్ చేయగా.. అది కాస్త వైరల్ అవుతోంది.
రెండేళ్లుగా దేశాన్ని కుదిపేస్తున్న ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కవితకు 7 రోజుల రిమాండ్ కూడా న్యాయస్థానం మంజూరు చేసింది. కాగా.. ఈ కుంభకోణంలో కవిత కీలక పాత్ర పోషించారు అని చెప్పడానికి సంబంధించి బలమైన ఆధారాలను సేకరించిన తర్వాతే.. కవితను అరెస్ట్ చేసినట్టు కస్టడీ పిటిషన్‌లో ఈడీ అధికారులు పేర్కొన్నారు. మరోవైపు.. ఈడీ అరెస్ట్ అన్యాయమని.. దీనిపై న్యాయపరంగా పోరాడతామంటూ కవిత, బీఆర్ఎస్ నేతలు చెప్తుండటం గమనార్హం. ఇదంతా సీరియస్‌గా నడుస్తుంటే.. నెట్టింట మాత్రం కవితకు సంబంధించిన ఓ పాత వీడియో తెగ వైరల్ అవుతోంది. తవ్వకాల్లో బయటపడ్డ ఒక అద్భుతం అంటూ.. ఆ వీడియోను తెగ వైరల్ చేస్తున్నారు. గతంలో.. అంటే కొన్నేళ్ల క్రితం ఓ న్యూస్ ఛానల్‌లో కవితను ఇంటర్వ్యూ చేశారు. అయితే.. ఈ ఇంటర్వ్యూలో భాగంగా.. కవితకు యాంకరమ్మ ఓ ప్రశ్న సంధించింది. "మీరు నిజంగా ముఖ్యమంత్రి అయితే.. ఒకవేళ అయితే.. అహ్ అయ్యారే అనుకోండి.. మీరు కచ్చితంగా తీసుకోబోయే అద్భుతమైన నిర్ణయం ఏంటీ..?" అని యాంకరమ్మ ప్రశ్న అత్యద్భుతమైన ప్రశ్న అడగ్గా.. ఆ ప్రశ్న అడుగుతున్నంతసేపు కవిత నవ్వులు చిందిస్తూనే ఉన్నారు. మొత్తానికి ప్రశ్న పూర్తయిన తర్వాత.. ఎక్కువ సమయం ఆలోచించకుండానే కవిత కూడా సమాధానం చెప్పేశారు. "ఐ థింక్.. ఐ



ప్రాబబ్లీ అవైడ్ ఆల్కహాల్ అండీ.. ఐ థింక్ సో.." అంటూ సింపుల్‌గా చెప్పినా తాను ముఖ్యమంత్రి అయితే తెలంగాణలో మద్యాన్ని నిషేదిస్తా అని చాలా పెద్ద నిర్ణయమే చెప్పేశారు. అయితే.. కవిత చెప్పిన సమాధానానికి అక్కడున్న ప్రేక్షకులు చప్పట్లతో అభినందించారు కూడా. అయితే.. అక్కడితో కవిత సమాధానం అయిపోలేదు. ముందు చెప్పిన దానికి కొనసాగింపుగా.. "అందరు అంటారు చాలా నష్టం వస్తుంది.. అది ఇది అని గానీ.. మొత్తం నేను చేయగలిగితే మాత్రం ఐ సర్టెన్లీ డూ దట్.." అని తన సమాధానానికి కన్‌క్లూజన్ కూడా ఇచ్చారు కవిత. అయితే.. అప్పుడు మద్యాన్ని నిషేధిస్తా అని చెప్పుకొచ్చిన కవిత.. ఇప్పుడు మద్యం కుభకోణంలో కీలక పాత్ర పోషిస్తున్నారంటూ ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు నెటిజన్లు. అయితే.. ఈ వీడియోపై నెటిజన్లు కూడా చాలా రకాలుగా స్పందిస్తున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు పాజిటివ్‌గా స్పందిస్తుంటే.. కాంగ్రెస్, బీజేపీకి చెందిన శ్రేణులు మాత్రం సెటైర్లు వేసుకుంటూ.. వీడియోను మరింత వైరల్ చేస్తున్నారు. "ఆమె చెప్పింది నిజమే కదా.. మన రాష్ట్రంలో బంద్ చేస్తాం అందీ.. మిగతా రాష్ట్రాల్లో అమ్ముకుంటాం అందీ.. అందుకే ఢిల్లీలో అమ్ముకుంది.. ఇందులో తప్పేమీ ఉంది." అంటూ తనదైన శైలిలో వ్యంగ్యంగా కామెంట్ చేశాడు.

# పదో తరగతి విద్యార్థులకు టీఎస్ ఆర్టీసీ గుడ్‌న్యూస్



నేటి నుంచి తెలంగాణలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా.. పరీక్షలు రాసే విద్యార్థులకు టీఎస్ ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులతో పాటు ఉచితంగా జర్నీ సౌకర్యం కల్పిస్తున్నట్లు సంస్థ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. నేటి నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.
పరీక్షల నిర్వహణ కోసం సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఏప్రిల్ 2 వరకూ జరిగే పరీక్షలకు రాష్ట్రంలో 5,08,385 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో పరీక్షలు రాసే విద్యార్థులకు టీఎస్ ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు సంస్థ ఎండీ సజ్జనార్



వెల్లడించారు. విద్యార్థులు తమ వద్ద ఉన్న బస్ పాస్, హాల్ టికెట్ చూపించి ఎగ్జామ్ హాల్ వరకు ఫ్రీ జర్నీ చేయవచ్చునని తెలిపారు. 'పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఆల్ ది బెస్ట్. విద్యార్థులకు రవాణా విషయంలో అసౌకర్యం కలగకుండా యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. తెలంగాణ విద్యా శాఖ సూచనల మేరకు పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు ఉదయం 8.45 గంటలకు చేరుకునేలా ప్రత్యేక బస్సులను నడుపుతోంది. సోమవారం (18.03.2024) నుంచి 02.04.2024 వరకు బస్సులు తిరుగుతాయి. మహాలక్ష్మి పథకంలో భాగంగా విద్యార్థినిలకు ప్రయాణం ఫ్రీ కాగా.. విద్యార్థులు తమ దగ్గర ఉన్న పాత బస్ పాస్, హాల్ టికెట్ చూపించి పరీక్షా కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఎక్స్ ప్రెస్ బస్సుల్లోనూ కాంబినేషన్ టికెట్ సదుపాయం కూడా వారికి అందుబాటులో ఉంది. కావున క్షేమంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి.. ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థులను కోరుతోంది.' అని సజ్జనార్ ట్వీట్ చేశారు.

# తెలంగాణలో 4 రోజులు వర్షాలు..

తెలంగాణలో నేటి నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉపరితల ద్రోణి కారణంగా వర్షాలు పడే ఛాన్స్ ఉందని అన్నారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ చల్లని కబురు చెప్పింది. నేటి (మార్చి 18) నుంచి 4 రోజుల పాటు రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నల్గొండ, వికారాబాద్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో కురుస్తాయని తెలిపింది. మహారాష్ట్ర నుంచి కర్ణాటక వీదుగా ఉత్తర కేరళ వరకు ద్రోణి కొనసాగుతున్నట్లు వెల్లడించింది.
ఇక శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు 9 జిల్లాల్లో వందకుపైగా ప్రాంతాల్లో వర్షాలు కురిసినట్లు వాతావరణశాఖ తెలిపింది. అత్యధికంగా కామారెడ్డి జిల్లా సదాశివనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలాల్లో 5 సెం.మీ.,



కరీంనగర్‌లో 4 సెం.మీ. వర్షపాతం నమోదైందనట్లు వెల్లడించారు. ఆదివారం కామారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వడగళ్ల వానలు కురిశాయి. వర్షాలతో రాష్ట్రమంతటా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు నుంచి నాలుగు డిగ్రీల వరకు తగ్గుముఖం పట్టాయి. ఇవాళ హైదరాబాద్ చల్లని వాతావరణం ఉంటుందని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

# చేపల చెరువు కాపలాకు వెళితే..

చేపల చెరువును కాంట్రాక్టు తీసుకొని రాత్రి సమయంలో చెరువు కాపలాకు కారులో వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. చెరువు వద్ద కలిసిన ఓ దుండగుడు.. యజమానిని మాటల్లో పెట్టి కారుతో ఉడాయించాడు. దాంతో షాక్‌కు గురైన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.
చెరువులో చేపల కాపలాకు కారులో వెళ్లిన ఓ వ్యక్తి ఊహించని షాక్ ఎదురైంది. ఆయన్ను మాటల్లో పెట్టి గుర్తు తెలియని దుండగుడు కారును ఎత్తుకెళ్లాడు. దృష్టి మరల్చి కారుతో సహా ఉడాయించాడు. దాంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలో చోటు చేసుకుంది.
వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి రామచంద్రాపురా నికి చెందిన చిగురు శ్రీను చేపల చెరువులు కాంట్రాక్టులు తీసుకునే జీవనం సాగిస్తున్నాడు. రాయసముద్రం చెరువులో రెండేళ్ల పాటు చేపలు వేసుకుని పెంచుకునేందుకు కాంట్రాక్టు తీసుకున్నారు. అయితే రాత్రి సమయంలో ఎవరైనా చేపలను పట్టుకొని వెళ్తారేమోనని తన కారు వేసుకొని కాపలాకు వెళ్లాడు. అప్పటికే చెరువు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉన్నాడు. ఈ రాత్రి సమయంలో ఇక్కడేం పని శ్రీను అతడిని అడగ్గా.. ఏదో సమాధానం చెప్పి మాట కలిపాడు. అనంతరం కాసేపు శ్రీనుతో ముచ్చటించిన దుండగుడు.. అతడి దృష్టిని మరల్చాడు. ఆపై శ్రీను కారును చాకచక్యంగా దొంగలించి అక్కడి నుంచి ఉడాయించాడు. వేగంగా కారును తీసుకెళ్తున్న దృశ్యాలు కొద్ది దూరంలోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఊహించని ఘటనతో షాక్‌కు గురైన శ్రీను వెంటనే రామచంద్రాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

# సింగర్ మంగ్లీ ప్రయాణిస్తున్న కారుకు యాక్సిడెంట్



సింగర్ మంగ్లీ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. హైదరాబాద్ శివారులో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై శంషాబాద్ మండలం తొండుపల్లి వద్ద ఈ ప్రమాదం జరగ్గా..ఆమె స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్టార్ సింగర్ ప్రముఖ మంగ్లీకి పెను ప్రమాదం తప్పింది. ఆమె ప్రయాణిస్తున్న కారును ఓ డీసీఎం వాహనం ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనంలో ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవానికి మంగ్లీ ఆదివారం హాజరయ్యారు. అదేరోజు అర్ధరాత్రి తర్వాత మేఘ్‌రాజ్, మనోహర్‌తో కలిసి ఆమె కారులో హైదరాబాద్-బెంగళూర్ జాతీయ రహదారి మీదుగా ఇంటికి బయల్దేరారు. అయితే శంషాబాద్ మండలం తొండుపల్లి బ్రిడ్జి వద్దకు రాగానే..ఓ డీసీఎం వాహనం వెనక నుంచి వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో మంగ్లీతో సహ కారులో ఉన్న ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదంలో కారు వెనక భాగం పూర్తిగా దెబ్బతింది. మంగ్లీకి ప్రమాదం తప్పడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. న్యూస్ టీవీ యాంకర్‌గా మంగ్లీ ప్రయాణం ప్రారంభం కాగా.. నేడు సినిమాల్లో పాడుతూ మోస్ట్ వాంటెడ్ సింగర్‌గా మారిపోయింది. తన గాత్రంతో శ్రోతలను ఇట్టే కట్టిపడేస్తుంది. అది ఫోక్ సాంగ్ అయినా సరే.. ఐటెం సాంగ్ అయినా థియేటర్లలో ప్రేక్షలు ఊగిపోవాల్సిందే. వరుస అవకాశాలతో సినిమా రంగంలో దూసుకెళ్లటంతో పాటు ప్రైవేటు కార్యక్రమాల్లో పాటలు పాడుతోంది.

# హైదరాబాద్‌లో కొత్త రైల్వే స్టేషన్.. శరవేగంగా పనులు, త్వరలోనే ప్రారంభం

హైదరాబాద్ నుంచి ట్రైన్ ప్రయాణాలు చేసేవారికి సౌత్ సెంట్రల్ రైల్వే గుడ్‌న్యూస్ చెప్పింది. నగరంలో రూ.430 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్ త్వరలో అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు. పనులు తుదిదశకు చేరుకున్నాయని.. ఈనెలాఖరులోగా ట్రైన్ల రాకపోకలు సాగుతాయని చెప్పారు. హైదరాబాద్‌లో రైల్వే స్టేషన్లు అంటే అందరికీ ఠక్కున గుర్తొచ్చే స్టేషన్లు కాచిగూడ, సికింద్రాబాద్, నాంపల్లి మాత్రమే. త్వరలో నగరంలో మరో కొత్త రైల్వే స్టేషన్ అందుబాటులోకి రానుంది. జిల్లాల నుంచి వచ్చే ప్రయాణికుల ఇబ్బందులు తీర్చేందుకు, హైదరాబాద్‌లోని మూడు ప్రధాన రైల్వే స్టేషన్లపై భారం తగ్గించేందుకు నగర శివారులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ఇది వరకే అక్కడ రైల్వే స్టేషన్ ఉండగా.. ఎయిర్ పోర్టు తరహాలో ఆ స్టేషన్ అప్‌గ్రేడ్ చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది. హైదరాబాద్ నగరానికి మణిహారంగా భావిస్తున్న చర్లపల్లి రైల్వేస్టేషన్ మరికొన్ని రోజుల్లో ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ఈ స్టేషన్ నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. ఇప్పటికే మూడు జతల ట్రైన్లను స్టేషన్‌లో నిలుపుతుండగా.. మరికొన్ని ఆపడమే కాకుండా.. అక్కడి నుంచే బయలుదేరేలా రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది. సనత్‌నగర్ - మౌలాలి మధ్య రెండో లైను సిద్ధమవ్వడంతో నగరం మీదుగా వెళ్తున్న ట్రైన్లను బైపాస్ చేయడానికి ఈ స్టేషన్‌తో వీలు చిక్కుతోంది.
ఈ నేపథ్యంలో ఈ నెలాఖరుకు పూర్తి స్థాయిలో చర్లపల్లి రైల్వే స్టేషన్ సిద్ధం చేసేందుకు అధికారులు రెడీ అయ్యారు. రూ.430 కోట్ల అంచనా వ్యయంతో చర్లపల్లి టెర్మినల్ నిర్మిస్తున్నారు. గతంలో ఇక్కడ రెండు ప్లాట్‌ఫామ్‌లు, మూడు రైల్వే లైన్లుగా ఉన్న చర్లపల్లిలో ఇప్పుడు 9 ప్లాట్‌ఫామ్‌లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే 24 బోగీలు పట్టేలా 5 ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి రాగా.. మరో 4 ఎత్తయిన ప్లాట్‌ఫామ్‌లు నిర్మాణ దశలో

**త్వరలో నగరంలో మరో కొత్త రైల్వే స్టేషన్ అందుబాటులోకి రానుంది. జిల్లాల నుంచి వచ్చే ప్రయాణికుల ఇబ్బందులు తీర్చేందుకు, హైదరాబాద్‌లోని మూడు ప్రధాన రైల్వే స్టేషన్లపై భారం తగ్గించేందుకు నగర శివారులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ఇది వరకే అక్కడ రైల్వే స్టేషన్ ఉండగా.. ఎయిర్ పోర్టు తరహాలో ఆ స్టేషన్ అప్‌గ్రేడ్ చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది.**



ఉన్నాయి. 12 మీటర్ల వెడల్పుతో రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు రానుండగా.. 6 మీటర్ల వెడల్పుతో మరొకటి కూడా రెడీ అవుతోంది. 9 ప్లాట్‌ఫామ్‌లలో ఎస్కలేటర్లు, లిఫ్టులు ఉంటాయి. మొత్తం 7 లిఫ్టులు, 6 ఎస్కలేటర్లు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తున్నాయి. కోచ్ నిర్వహణ వ్యవస్థతో పాటు..%వీమీూ% ట్రైన్లకు ఎలాంటి ఆటంకం లేకుండా రెండు ప్లాట్‌ఫామ్‌లు నిర్మిస్తున్నారు. స్టేషన్ బయట బస్‌బేలు, ప్రవేశమార్గాలు, పార్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తే ట్రైన్ల ఆలస్యానికి చెక్ పెట్టడంతో పాటు జిల్లాల నుంచి వచ్చే ప్రయాణికులు హైదరాబాద్ మెయిన్ సిటీలోకి రావాల్సిన పనిలేకుండా శివారు స్టేషన్ నుంచి ట్రైన్లు ఎక్కే వీలుటుందని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు.

# రిలీజ్ డేట్ అప్‌డేట్..



మెగా ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న సినిమాల్లో గేమ్ ఛేంజర్ ఒకటి. దాదాపు మూడేళ్లుగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం రిలీజ్ డేట్‌పై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరి ఈ సినిమాను ఎప్పుడు రిలీజ్ చేస్తారు? గ్లోబల్ స్టార్ రామ్ చరణ్.. శంకర్ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. ప్రస్తుతం వైజాగ్‌లో షూటింగ్ జరుగుతోన్న ఈ చిత్రంపై మెగా ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఆర్ఆర్ఆర్ తర్వాత చరణ్ చేస్తున్న సినిమా ఇదే కావడంతో దానికి మంచి ఉంటుందని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. ఇక దాదాపు మూడు ఏడేళ్లుగా నిర్మాణంలో ఉన్న ఈ చిత్రం విడుదల తేదీ ఇంకా ప్రకటించలేదు. అయితే తాజాగా సినిమా రిలీజ్ డేట్‌ను లాక్ చేయాలని భావిస్తున్నారట.

దసరా లేదా!... గేమ్ ఛేంజర్ షూటింగ్ చివరి దశకి చేరుకోవడంతో దిల్ రాజు- రామ్ చరణ్ ఈ సినిమా విడుదల తేదీపై నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నారట. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తయిపోతే గేమ్ ఛేంజర్‌ని ఈ దసరాకి దింపుదామని దిల్ రాజు అనుకుంటున్నారట. ఒకవేళ ఆ డేట్ మిస్ అయితే 2025 సంక్రాంతికి రిలీజ్ చేద్దామని ప్లాన్ చేస్తున్నారట.

ఒకవేళ దసరాకి రిలీజైతే ఎన్టీఆర్ 'దేవర'తో గేమ్ ఛేంజర్ పోటీ పడాల్సి వస్తుంది. అది జరగకపోతే వచ్చే ఏడాది సంక్రాంతికి మెగా ఫ్యాన్స్‌కి ఫీస్ట్‌యే అవుతుంది. ఎందుకంటే మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర' వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కాబోతుంది. అదే టైమ్‌కి గేమ్ ఛేంజర్ కూడా వస్తే ఇక మాములుగా ఉండదు. మరి ఈ రెండింటిలో ఏ డేట్ ఫిక్స్ అవుతుందో చూడాలి. ఇక చరణ్-బుచ్చి బాబు కాంబోలో వస్తున్న ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. క్యాస్టింగ్ సెలక్షన్‌లో బుచ్చి బాబు బిజీగా ఉన్నాడు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా జాన్వీ కపూర్‌ను ప్రకటించారు. అలానే ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. ఇక మిగిలిన పాత్రలకి కూడా నటీనటుల ఎంపిక



జరుగుతుంది. ఇక ఈ సినిమాలో సీరియల్ నటుడు అంబటి అర్జున్ కూడా ఓ పాత్ర చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకి 'పెద్ది' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు సమాచారం. నిజానికి ఈ టైటిల్‌ను ఎన్టీఆర్‌తో చేసే సినిమా కోసం బుచ్చి బాబు రిజిస్టర్ చేశారట. కానీ రామ్ చరణ్ సినిమాకి ఈ టైటిల్ సరిగ్గా సరిపోతుందని డిసైడ్ అయ్యారట. దీంతో పెద్ది టైటిల్‌నే ఫిక్స్ చేశారని టాక్ నడుస్తోంది. ఇక రూరల్ డ్రామాగా ఈ చిత్రం రాబోతుంది. రంగస్థలం సినిమాలానే ఇది ఉంటుందని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. ఇక ఈ చిత్రంపై లేటెస్ట్ అప్‌డేట్స్ కోసం వేచి చూడాల్సిందే.

# 'సలార్ -2' ముహూర్తం పెట్టేసారా?

జులైలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారుట. అంతకు ముందు నిరాడంబరంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. 'సలార్ -2' ముహూర్తం పెట్టేసారా? వేసవి అనంతరం షురూ చేయబోతున్నారా? అందుకోసం ప్రత్యేకమైన సెట్ నిర్మాణం ప్లాన్ చేస్తున్నారా? అంటే అవుననే లీకులందుతున్నాయి. 'సలార్-2' చిత్రాన్ని 15 నెలల్లోనే పూర్తిచేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని హోంబలే ఫిల్మ్స్ అభిమానులకు మాటిచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని అధికారికంగానూ ప్రకటించారు. దీంతో మేకర్స్ ఇప్పుడు ఆ మాటను నిలబె ట్టుకునే పనులు మొదలు పెడుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి 'సలార్ -2' చిత్రాన్ని తొమ్మిది నెలలు గ్యాప్ తీసుకుని తెరకెక్కించాలని దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్లాన్ చేసుకున్నారు. కానీ 'సలార్' విజయం చూసిన తర్వాత అంత గ్యాప్ తీసుకోవడం కరెక్ట్ కాదని ముందు గానే పట్టాలెక్కించాలని నిర్ణయం మార్చుకున్నారు. అప్పటి నుంచి ఈ చిత్రాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారు? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే ఇప్పుడు అందుకు ముహూర్తం కుదిరినట్లు కనిపిస్తుంది. జులైలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారుట. అంతకు ముందు నిరాడంబరంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. జులై అంటే అప్పటికి వేసవి కాలం కూడా పూర్తవుతుంది. ఎండల ఇబ్బంది ఉండదు ప్రశాంతంగా షూటింగ్ కి వెళ్లొచ్చు. ఈ సినిమా షూట్ అంతా సెట్స్ లోనే చేయాల్సి ఉంటుంది. దీంతో సమ్మర్ లో షూటింగ్ అంటే అసాధ్యమైన పనే. అందుకే ఇలా అన్నిరకాల వెసులు బాటు చూసుకుని ప్లాన్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు దాదాపు ముగింపు దశకు చేరుకున్నట్లు సమాచారం. కథలో అవసరమైన కొన్ని మార్పులు చేసినట్లు వినిపిస్తుంది. 'సలార్ సీజ్ ఫైర్' ఎలాంటి విజయం సాధించిందో తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద 700 కోట్లకు పైగా వసూళ్లను సాధించిన సంగతి తెలిసిందే. నిజానికి సలార్ 1000 కోట్లు టార్గెట్ గా రిలీజ్ అయింది. కానీ 700 కోట్ల వద్దనే ఆగిపోయింది. సలా ర్-2 తో అన్ని లెక్కలు సరిచేయాలని నీల్ అండ్ కో ప్లాన్ చేస్తోంది.

# 'అందరికీ ఫ్రీగా పంపిస్తా'..



మంచు విష్ణు భారీ బడ్జెట్ సినిమా 'కన్నప్ప' నుంచి ఇటీవల ఫస్ట్ లుక్ రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ లుక్‌కి వచ్చిన రెస్పాన్స్‌పై మంచు విష్ణు మాట్లాడారు. అలానే తన తండ్రి మోహన్ బాబు బర్త్ డే సందర్భంగా ఓ గిఫ్ట్ కూడా ప్లాన్ చేసినట్లు చెప్పారు.

'కన్నప్ప' ఫస్ట్‌లుక్‌కి వచ్చిన స్పందనపై హీరో మంచు విష్ణు ఫుల్ హ్యాపీగా ఉన్నారు. దీనిపై ప్రత్యేకంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో కూడా పోస్ట్ చేశారు విష్ణు. కన్నప్ప ఫస్ట్ లుక్‌ను ఇంతగా ఆదరించిన అభిమానులకు థ్యాంక్స్ చెబుతూ మరో ముఖ్యమైన విషయాన్ని చెప్పుకొచ్చారు. కన్నప్ప కథను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లుగా విష్ణు తెలిపారు. "కన్నప్ప ఫస్ట్ లుక్‌కి వచ్చిన రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా అనిపించింది. ఫస్ట్ లుక్ రిలీజ్ చేసేముందు కాస్త భయపడ్డాను. ఎందుకంటే నేను ఎప్పుడూ ఇలాంటి రోల్ చేయలేదు. అంతా ఈశ్వరేచ్ఛ.. ఆయన బ్లెస్సింగ్స్ వల్లే కన్నప్ప మూవీ చేయగలుగుతున్నాను. కన్నప్ప హిస్టరీ గురించి చాలా మంది నన్ను అడుగుతున్నారు. కన్నడ, తెలుగు వాళ్లే కాదు తమిళం, మలయాళం వాళ్లు కూడా కొన్ని ప్రశ్నలు అడుగుతున్నారు. ఇక నార్త్ నుంచి అయితే లెక్క లేనన్ని ప్రశ్నలు వస్తున్నాయి. వాళ్లకి కన్నప్ప గురించి తెలియదు. ఇది నాకు బ్లెస్సింగ్ అనుకుంటున్నాను.. కన్నప్ప గురించి శ్రీకాళహస్తి స్టోరీ గురించి చెప్పే అవకాశం నాకు దక్కింది." అంటూ మంచు విష్ణు చెప్పారు.

బుక్ రిలీజ్ చేస్తా... "కన్నప్ప గురించి ఇంత మందికి ఒక్కొక్కరిగా ఆన్సర్ చేయాలంటే చాలా కష్టం. అందుకే మార్చి 19న నేను కన్నప్ప మీద ఓ కామిక్ బుక్ లాంఛ్ చేయబోతున్నాను. ఆ రోజు ఫస్ట్ వాల్యూమ్ రిలీజ్ చేస్తాను. ఇది లిమిటెడ్ ఎడిషన్‌గా రాబోతుంది. ఈ స్టోరీ బుక్ మీద ఎవరికి ఆసక్తి ఉన్నా నాకు డైరెక్ట్‌గా ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ చేయండి. మార్చి 19న నా హీరో బర్త్ డే.. నా ఫాదర్ పుట్టిన రోజు సందర్భంగా కన్నప్ప స్టోరీ బుక్‌ను లాంఛ్ చేస్తాను. నా ఆఫీస్ వాళ్లు బుక్ మీకు కొరియర్‌లో పంపిస్తారు. ఎవరు మెసేజ్ చేస్తే వారికి ఫ్రీగా పంపిస్తాను. ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. మీ అందరికీ కన్నప్ప గురించి చెప్పడం నా బాధ్యత." అంటూ వీడియోలో విష్ణు చెప్పారు. పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఇక శివుడిగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కనిపించబోతున్నారు. అలానే మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ కూడా ఓ కేమియో చేస్తున్నారు. ఇక ఈ చిత్రంలో మోహన్ బాబు, బ్రహ్మానందం, శరత్ కుమార్ వంటి స్టార్ యాక్టర్స్ కూడా నటిస్తున్నారు.

# తిరిగి ఇచ్చేయాలని ప్రయత్నిస్తున్నా



నిహారిక మాజీ భర్త చైతన్య జొన్నలగడ్డ ప్రస్తుతం నెట్టింట్లో యాక్టివ్ అయ్యాడు. ప్రతీ రోజూ ఏదో ఒక పోస్ట్ వేస్తున్నాడు. తన స్థాయి వాళ్లకి అర్థమయ్యేలానే కవిత్వాలు రాస్తున్నాడు. తాజాగా మరో పోస్ట్ వేశాడు. నెట్టింట్లో కాస్త పాజిటివిటీ పంచాలనే ఉద్దేశంతో ఇదంతా రాస్తున్నట్టుగా చెప్పుకొచ్చాడు. నిహారిక మాజీ భర్త చైతన్య జొన్నలగడ్డ నెట్టింట్లో అంత యాక్టివ్‌గా ఉండడన్న సంగతి తెలిసిందే. నిహారిక, చైతన్యల విడాకుల తరువాత ఇద్దరూ ఎవరి ప్రపంచంలో వారు బతికేస్తున్నారు. నిహారిక అయితే సినిమాలు నిర్మిస్తూ, నటిస్తూ ఫుల్ బిజీగా మారింది. చైతన్య మాత్రం నెట్టింట్లో అంత యాక్టివ్‌గా ఉండేవాడు కాదు. కానీ ఇప్పుడు వరుసగా పోస్టులు చేస్తున్నాడు. ఆ మధ్య నిఖిల్ నిహారిక ఇంటర్వ్యూ మీద కౌంటర్లు వేశాడు. అలా చాలా రోజులకు నోరు విప్పి చైతన్య అలా కామెంట్లు చేయడంతో ఎక్కువగా చర్చలు జరిగాయి. తాజాగా చైతన్య తనకు నచ్చిన, మెచ్చిన సూక్తులను చెబుతున్నాడు. నిశ్శబ్దం అంటూ ఆయన చెప్పిన పొయెట్రీ, సూక్తులు నెట్టింట్లో బాగానే వైరల్ అయ్యాయి. అయితే తాజాగా ఆత్మ గురించి ఓ పాజిటివ్ పొయెట్రీని చెప్పుకొచ్చాడు. ప్రకృతి, ఆత్మ, దైవం అంటూ ఇలా చైతన్య తనకు నచ్చినట్టుగా, మినిమం డిగ్రీ స్థాయి అనేట్టుగా కవిత్వం రాసుకొచ్చాడు. అయితే ఇదంతా కూడా ఇన్ స్టాగ్రాంలో కాస్త పాజిటివిటీని స్ప్రెడ్ చేయాలనే ఉద్దేశంతో చేస్తున్న ప్రయత్నమని అన్నాడు. చాలా రోజుల తరువాత ఇలా మళ్లీ రాస్తున్నాను.. ఇన్ స్టా కమ్యూనిటీకి నా వల్ల అయినంతలో ఇలా చిన్నగా అయినా తిరిగి ఇవ్వాలనే, పాజిటివిటీ పెంచాలనే ప్రయత్నం చేస్తున్నా అంటూ చైతన్య చెప్పుకొచ్చాడు. చైతన్య ఇప్పుడు సింగిల్‌గానే ఉండేందుకు నిర్ణయించుకున్నట్టుగా కనిపిస్తోంది. మరో వైపు నిహారిక ఏమో రెండో పెళ్లి మీద ఇంట్రెస్ట్ చూపిస్తున్నట్టుగా అనిపిస్తోంది. మరి చైతన్య ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? ఇతగాడు కూడా రెండో పెళ్లికి సిద్ధం అవుతాడా? అన్నది చూడాలి.





# ఆ రోజే సర్‌ప్రైజ్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగిన సంగతి తెలిసిందే. ఇలాంటి వేళ పవన్ కళ్యాణ్ కొత్త సినిమా నుంచి అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. మరి దీని సంగతేంటో ఓ లుక్కేద్దాం. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చేతిలో ప్రస్తుతం ఓజీ, హరిహర వీరమల్లు, ఉస్తాద్ భగత్ సింగ్ ఇలా మూడు ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే ఇందులో ఓజీ సినిమా షూటింగ్ దాదాపు పూర్తి అయినట్లే. ఇక దీని రిలీజ్ డేట్ కూడా ప్రకటించేశారు. అయితే మిగిలిన రెండు ప్రాజెక్టులపై ఎలాంటి అప్‌డేట్‌లు లేవు. పైగా ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు ఉండటంతో వీటి నుంచి అప్‌డేట్స్ కూడా ఫ్యాన్స్ ఊహించడం లేదు. సరిగ్గా ఇలాంటి వేళ ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ టీమ్ ఫ్యాన్స్‌కి ఓ సర్‌ప్రైజ్ ఇచ్చింది. దీంతో అటకెక్కిన ఉస్తాద్ కాస్తా నేషనల్ వైడ్ ట్రెండింగ్‌లోకి వచ్చేసింది.

టీజర్ డేట్ ఫిక్స్!... హరీష్ శంకర్ దర్శకత్వంలో రాబోతున్న ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి తాజాగా ఓ క్రేజీ అప్‌డేట్ వచ్చింది. "ఎక్స్‌పెక్ట్ ది అన్? ఎక్స్‌పెక్టెడ్" అంటూ మార్చి 19 డేట్‌తో ఓ పోస్ట్ పెట్టింది ఈ మూవీ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్. ఇక ఈ పోస్టులో పవన్ కళ్యాణ్ డబ్బింగ్ సెషన్‌లో పాల్గొన్న ఫొటోలు కనిపించాయి. అంటే మార్చి 19న ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేస్తున్నారని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు. అందుకే పవన్ డబ్బింగ్ చెబుతున్న ఫొటోలను పోస్ట్ చేశారంటూ కామెంట్లు పెడుతున్నారు. ఇక ఈ ట్వీట్‌ను "లెట్స్ డూ ఇట్ ఎగైన్" అంటూ డైరెక్టర్ హరీష్ శంకర్ రీట్వీట్ చేశారు. మొత్తానికి ఒక్క అప్‌డేట్‌తో ఉస్తాద్ భగత్ సింగ్ హ్యాష్ ట్యాగ్ ట్విట్టర్‌లో తెగ ట్రెండ్ అవుతుంది. ఇక ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వస్తున్న ఈ ప్రాజెక్టుకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

తేరి రీమేక్..... ఉస్తాద్ భగత్ సింగ్ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పుడు దీనిపై చాలా అంచనాలు ఏర్పడ్డాయి. కానీ ఇది తమిళ హీరో విజయ్ నటించిన తేరి మూవీకి రీమేక్ అంటూ సోషల్ మీడియాలో రావడంతో పవన్ ఫ్యాన్స్ బాగా హర్ట్ అయ్యారు. ఇక అన్నీ రీమేక్ సినిమాలే వస్తే ఎలా అంటూ డైరెక్టర్ హరీష్ శంకర్‌పై ఫైర్ అయ్యారు. ఈ రీమేక్ సినిమాలు చేయొద్దంటూ పవన్‌కి సలహాలు కూడా ఇచ్చారు. కానీ తేరి రీమేక్ అయినప్పటికీ కథనంలో చాలా మార్పులు చేసి ఉస్తాద్‌ను తీసుకువస్తున్నట్లుగా చెప్పడంతో ఫ్యాన్స్ కాస్త శాంతించారు. అయితే ఈ షూటింగ్‌కి సడెన్ బ్రేక్ పడటంతో ఇప్పట్లో ఉస్తాద్ ఊసే లేదని ఫిక్స్ అయిపోయారు. కానీ సడెన్‌గా ఇప్పుడు టీజర్ అప్‌డేట్ వచ్చింది.

# స్క్రిప్టులు దొంగతనం చేయగలరేమో గానీ లాక్కోలేరు!..

పూనమ్ కౌర్ నెట్టింట్లో ఎప్పుడూ ఏదో ఒక కాంట్రవర్సీకి దారి తీసేలా పోస్టులు వేస్తుంటుంది. తాజాగా దాసరి నారాయణ రావు గురించి చెబుతూ, ఆయన మంచితనం గురించి చెబుతూ.. ఇండస్ట్రీకి ఒక్కరే గురువు అని చెప్పుకొచ్చింది. స్క్రిప్టులు దొంగిలించగలరేమో గానీ గురు అనే పదాన్ని, స్థానాన్ని దొంగిలించలేరు అని కౌంటర్లు వేసింది. పూనమ్ కౌర్ ఎప్పుడూ ఏదో ఒక కాంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటుంది. నెట్టింట్లో ఆమె వేసే పోస్టులు ఎప్పుడూ చర్చలకు దారి తీస్తుంటుంది. ఆమె ఎప్పుడూ నర్మగర్భంగా ట్వీట్లు వేస్తుంటుంది. కానీ మొదటి సారి త్రివిక్రమ్ పేరు పెట్టి ట్వీట్ వేసింది. యూజ్ లెస్ ఫెల్లో అంటూ త్రివిక్రమ్ పేరు పెట్టి ట్వీట్ వేయడం సంచలనంగా మారింది. అంతే కాకుండా పూనమ్ కౌర్ ఈ మధ్య జల్సా వివాదంపై కూడా స్పందించింది. జల్సాలో తనకు ఆఫర్ ఇవ్వకపోవడం వల్లే ఇలా చేస్తున్నానంటూ రూమర్లను క్రియేట్ చేశారని, కానీ అవేవీ నిజం కాదని పూనమ్ కౌర్ ట్వీట్ వేసింది.

పూనమ్ కౌర్ గతంలోనే దాసరి నారాయణ రావు గురించి ట్వీట్ వేసింది. ఆయనే ఇండస్ట్రీ పెద్దగా, గురువుగా ఉండేందుకు అన్ని విధాల అర్హులని, ఆయన అందరి సమస్యలు వినేవారని, ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహించేవారని దాసరి గురించి ఎంతో గొప్పగా చెబుతూ ఉండేది. తాజాగా మళ్లీ దాసరి నారాయణ రావు గురించి ట్వీట్ వేసింది. దాసరిని గురు అని సంబోధిస్తూ.. మరో దర్శకుడిపై కౌంటర్లు వేసినట్టుగా ఆ ట్వీట్ ఉంది. ఆమె తాజాగా వేసిన ట్వీట్‌లో ఇలా ఉంది.. 'ఈ విషయం నేను ఇది వరకు ఎన్నో సార్లు చెప్పాను.. ఇప్పుడూ చెబుతున్నాను. ఇండస్ట్రీలో గురు అనే పదానికి, ఆ స్థానానికి అర్హులైన వారు ఒక్కరే.. వారే దాసరి నారాయ ణరావుగారు.. ఆయన అందరినీ గౌరవించే వారు.. ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహించేవారు.. మిగతా వాళ్లు స్క్రిప్టులను హైజాక్ చేయగలరేమో గానీ గురు అనే పదాన్ని, స్థానాన్ని హైజాక్ చేయలేరు' అని కౌంటర్లు వేసింది. దీంతో మళ్లీ పూనమ్ కౌర్ ట్వీట్ మీద చర్చలు ప్రారంభం అయ్యాయి. త్రివిక్రమ్ గురించే అలా ట్వీట్ వేసిందని అంతా కామెంట్లు పెడుతు న్నారు. అసలేం జరిగిందో క్లియర్‌గా చెప్పొచ్చు కదా? ప్రతీ సారి ఈ దాగుడు మూతలు ఏంటి? నీకు జరిగిన అన్యాయం ఏంటి? అని జనాలు ప్రశ్నిస్తున్నారు.

# పడిపడి నవ్వుకున్న థమన్

స్టార్ మా ఛానల్‌లో ప్రసారం అవుతున్న సూపర్ సింగర్ షోకి నేటితో శుభం కార్డు పడనుంది. గ్రాండ్ ఫినాలేకి సంబంధించిన లేటెస్ట్ ప్రోమో తెగ వైరల్ అవుతోంది. ఇందులో అనంత శ్రీరామ్ డ్యాన్స్ హైలెట్‌గా ఉంది.

'గుంటూరు కారం' సినిమాలో 'కుర్చీ మడతపెట్టి' సాంగ్ ఎంత హిట్ అయిందో తెలిసిందే. సినిమా ఫలితం సంగతి పక్కనపెడితే ఈ సాంగ్‌లో శ్రీలీల-మహేష్ బాబు వేసిన స్టెప్పులు మాత్రం అదిరిపోయాయి. కేవలం ఈ సాంగ్ కోసమే సినిమాకి వెళ్లిన ఫ్యాన్స్ కూడా ఉన్నారు. ఇక యూట్యూబ్‌లో అయితే కుర్చీ మడతపెట్టి వీడియో సాంగ్‌కి 122 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఇక సోషల్ మీడియా సంగతి చెప్పక్కర్లేదు. ఎక్కడ చూసినా ఈ పాట రీల్స్‌యే దర్శనమిచ్చాయి. సీరియల్ సెలబ్రిటీల నుంచి స్ట్రీట్ సెలబ్రిటీల వరకూ అందరూ కుర్చీ మడతపెట్టి మరీ స్టెప్పులు ఇరగదీశారు. ఇక తాజాగా లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ కూడా కుర్చీ మడతపెట్టారు. దీనికి సూపర్ సింగర్ షో వేదికగా నిలిచింది. అనంత శ్రీరామ్ డ్యాన్స్ గురించి దాదాపు బుల్లితెర ఆడియన్స్ అందరికీ ఓ ఐడియా ఉంది. ఎందుకంటే గతంలో సరిగమప షోలో యాంకర్ ప్రదీప్‌తో కలిసి అప్పుడప్పుడూ అనంత శ్రీరామ్ స్టెప్పులేశారు. పూనకం వచ్చినట్లుగా ఊగిపోయి ఆయన వేసే స్టెప్పులు చూసి ఆడియన్స్ కూడా అవాక్కయ్యారు. ఇక తాజాగా సూపర్ సింగర్ గ్రాండ్ ఫినాలే కోసం ఓ డజను కుర్చీలు పట్టుకొని స్టేజ్ మీదకి వచ్చేశారు అనంత శ్రీరామ్. ఇక చేతిలో ఓ కుర్చీ పట్టుకొని ఆయన డ్యాన్స్‌తో మడతపెట్టేశారు. ఇక ఇది చూసి అక్కడున్న ఆడియన్స్, జడ్జీలు ఫుల్ విజిల్స్, క్లాప్స్‌తో తెగ ఎంకరేజ్ చేసేశారు. అయితే అన్నింటికంటే హైలెట్ ఏంటంటే ఈ సాంగ్‌ను కంపోజ్ చేసిన థమన్ ముందే అనంత శ్రీరామ్ ఈ పెర్ఫామెన్స్ ఇచ్చారు. ఇక తన పాటకి ఇంత దారుణంగా కుర్చీని మడతపెడతారని థమన్ అసలు ఊహించలేదు. దీంతో నవ్వాలో ఏడ్వాలో కూడా తెలీకుండా అదో రకమైన ఎక్స్‌ప్రెషన్‌తో థమన్ తెగ ఎంజాయ్ చేశారు.

# రజాకార్ దర్శకుడికి అసిస్టెంట్ నాని..

ఎన్నో ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న దర్శకుడు యాటా సత్యనారాయణ.. 'రజాకార్' సినిమాతో ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యారు. దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు దగ్గర శిష్యరికం చేసిన యాటా.. చాలా సూపర్ హిట్ సీరియల్స్‌ని రూపొందించారు. 'రజాకార్' సినిమా చూసిన తరువాత చాలామంది నోట నుంచి వచ్చే మాట ఏంటంటే.. ఆ దర్శకుడు ఎవరబ్బా అని. అణగతొక్కబడ్డ చరిత్రలోని వాస్తవాలను వెలికి తీశారో.. లేదంటే





వాస్తవాలను వక్రీకరించా రో.. రజాకార్ చిత్రంపై భిన్నాభిప్రాయాలున్నాయి కానీ.. ఇది మత చరిత్ర కాదు గత చరిత్ర అనుకుంటే మాత్రం రజాకార్ చిత్రం ఖచ్చితంగా గొప్ప చిత్రమే అవుతుంది. మత ఉగ్రవాదంలో పరమతాలపై విషం చిమ్మే వాళ్ల అభిప్రాయాలను పక్కనపెడితే.. ఒక దర్శకుడిగా కథను ఎంత వరకూ న్యాయం చేయొచ్చో చేశాడు దర్శకుడు యాటా సత్యనారాయణ  రజాకార్ సినిమా నిర్మాత బీజేపీ నాయకుడు.. ఈ సినిమా ప్రమోషన్స్‌ని కాషాయ పువ్వు పార్టీ వాళ్లు భుజాన వేసుకోవడంతో ఇది ఒక వర్గం వారికే.. ఒక మతానికి చెందినదే అన్న సంకేతాలు జనంలోకి వెళ్లిపోవడమే ఈ సినిమాకి ప్రధాన సమస్యగా మారింది. అసలు కాషాయ పార్టీ ప్రభావం లేకపోతే.. 'రజాకార్'.. మరో 'బలగం' అయ్యేదన్నా సందేహం లేదు. ఎందుకంటే కంటెంట్ ఉన్న సినిమాకి అడ్డుకట్ట వేయడం అంత ఈజీ కాదు. ఎప్పుడైతే ఈ సినిమాపై బీజేపీ మత ప్రభావం పడిందో.. మిగతా వర్గాలు దూరం అయిపోతున్నారు. ఆ మతం మచ్చే.. ఓ మంచి సినిమాని ప్రేక్షకుడికి దూరం చేస్తుంది. మతపరమైన విమర్శల్ని పక్కనపెడితే.. 'రజాకార్' సినిమాతో తెలంగాణ రక్త చరిత్రను గుర్తు చేశారు దర్శకుడు. తన దర్శకత్వ ప్రతిభతో.. కనుమరుగౌతున్న చరిత్రను కళ్లకి కట్టారు. దీంతో ఈ సినిమా చూసిన చాలామంది దర్శకుడి గురించే మాట్లాడుకుంటున్నారు. కాగా.. ఎన్నో ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న యాట సత్యనారాయణ దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు శిష్యుడు. కో డైరెక్టర్‌గా ఆయన దగ్గర శిష్యరికం చేసిన యాటా సత్యనారాయణ అనేక హిట్ సీరియల్స్‌కి దర్శకత్వం వహించారు. మనోయజ్ఞం, త్రిశూలం, స్వర్ణఖడ్గం వంటి సీరియల్స్‌కి డైరెక్ట్ చేశారు. ఇప్పుడు దేశం గర్వించదగ్గ దర్శకుడిగా పేరొందిన దర్శకధీరుడు రాజమౌళి.. ఈయనతో పాటే పనిచేశారు.

నితిన్ హీరోగా నటించిన 'అల్లరి బుల్లోడు' సినిమాకి యాటా సత్యనారాయణ కో డైరెక్టర్ కాగా.. ఇప్పటి స్టార్ హీరో నాని.. యాటాకి అప్పట్లో అసిస్టెంట్‌గా ఉండేవారు. అయితే నాని హీరో అయిన తరువాత అతనికి సీనియర్ అయిన యాటా సత్యనారాయణతో మాట్లాడటం మానేశారు. నాని 'అష్టాచెమ్మా' సినిమాతో హీరోగా లాంఛ్ అయినప్పుడు కూడా.. తనతో చిన్న మాట కూడా చెప్పలేదని.. పేపర్ లో చూసి ఫోన్ చేస్తే మాట్లాడారని.. అయితే హీరో అయిన తరువాత నాని మాట్లాడటమే మానేశారని చెప్పి వాపోయారు యాటా. నాని స్టార్ హీరో అయ్యారు.. నిర్మాతగా సినిమాలు తీస్తున్నారు. బాపు గారి కో డైరెక్టర్ శ్రీనివాస్ గారిని గాడ్ ఫాదర్‌లా భావించేవారు నాని.. ఆయనకు కూడా సినిమా ఛాన్స్ ఇవ్వలేదు నాని. దీన్ని బట్టి చూస్తే నాని మైండ్‌లో ఏదో ఉండి ఉంటుంది. లేకపోతే గాడ్ ఫాదర్ అనుకున్నవారికైనా సినిమా ఛాన్స్ ఇచ్చి ఉండేవాడు కదా. ఒకవేళ తనతో సినిమా చేస్తే.. గతంలో మాదిరిగా సార్ అనో.. లేదంటే యాటా గారూ అని పిలవాల్సి వస్తుందనో ఏమో కానీ.. తన ఫోన్‌కి నాని స్పందించడం మానేశారని చెప్పి.. హీరో కాక ముందు నాని ఉన్నారు.. హీరో అయిన తరువాత నాని ఎలా మారిపోయారో తన మాటల్లో వివరించి.. అప్పట్లో హాట్ టాపిక్ అయ్యారు 'రజకార్' చిత్ర దర్శకుడు యాటా సత్యనారాయణ. అన్నట్టు దర్శకుడు యాటా సత్యనారాయణ.. సీనియర్ యాంకర్ నవీన భర్త. తన భర్తతో కలిసి యాంకర్ నవీన అనేక వీడియోలను నెట్టింట్లో షేర్ చేస్తూ ఉంటారు. మొత్తానికి యాటా సత్యనారాయణ.. 'రజాకార్' సినిమాతో మళ్లీ వార్తల్లోకి వచ్చారు.